
# దేవతా మూర్తి

సౌందర్యోపాసకుడు ఈ సృష్టిలోని ప్రతి వస్తువులోనూ అందాల్నే చూస్తాడు. మందార మకరందాల్నే ఆసావదిస్తాడు.

ఆయుర్వేద వైద్యుడు – తను చూసిన అన్ని పిచ్చి మొక్కల్లోనూ ఔష ధీగణం చూస్తాడు. తన దృష్టిలో, ఈ సృష్టిలో ఔషధీయుక్తమైన చెట్లూ మూలికలే తప్ప అన్యం కనబడవు.



-బుటసు-జీ-ప్రకాష్

నిజమైన భక్తుడు ప్రతి అణువులోనూ దేవుణ్నే చూస్తాడు.

స్థపతి లేక శిల్పి తన కంటికి కనబడిన ప్రతి రాయిలోనూ ఓ కళాఖండాన్ని దర్శిస్తాడు. దర్శింపజేస్తాడు కూడా.

మనకి ముక్కోటి దేవతలున్నారు. వేదోప నిషత్తుల్లోనూ, పురాణాల్లోనూ, కావ్యాల్లోనూ, ప్రబంధాల్లోనూ వర్ణించబడిన ఊహాజనితమైన దేవతల ఆకారాలను దేశం నలుమూలలా వున్న శిల్పులు వివిధ భంగిమల్లో చెక్కుతున్నారు. దేవుని రూపాలు ఇన్ని కోట్లు వుండడం వల్లే కదా, శిల్పులకి తమ శిల్పకళానైపుణ్యం ప్రదర్శించే అవకాశం చిక్కింది?

రచయితలు, నేడు తమ రచనలలో శైలి, శిల్పం పదర్శిస్తూంటారు. ఈ శైలీ శిల్పం శిల లోంచి ఉద్భవించిన మాటలే. శిల మీద చెక్కబడింది కనుక 'శిల్పం' అని పేరు. శిల మీద చెక్కడమే 'శైలి' అయింది. శిల్పి ఏ విధంగా అందమైన కళాఖండాలను శిలలో మలుస్తాడో – అదే విధంగా రచయిత, శిల మీద కాక – కాగితం మీద మలచినా, ఆ రచనా విధానానికి 'శైలి' 'శిల్పం' అన్న పదాలు వాడుకలోకి వచ్చాయి.

అదే శిల్పి 'దేవుడొక్కడే' అని సిద్ధాంతీకరించే తత్త్వవేత్తల అభిప్రాయాన్ని మన్నించవలసి వస్తే ఒకే దేవుని బొమ్మను ఎన్ని రూపాల్లో చెక్కగలడు? చూసిన వాళ్ళకి చూసిందే చూడ్డం – చూసిందే చూడ్డం అయినట్లయితే బోరుకొట్టదూ?

ఇందుమౌళి ఒక ప్రముఖ స్థపతికి సహాయ కుడుగా వుంటూ తన వద్దనున్న సుత్తీ శాణం ఉలీ మొదలైన పరికరాలతో చాలామంది దేవు ళ్లను సృష్టించాడు. తన గురువుగారైన శిల్పితో చాలా గ్రామాలు తిరిగి దేవుళ్ళ బొమ్మలు చెక్కడంలో సహకరించి, తన సొంత వూరికి పయనమయాడు. మళ్లీ ఎప్పుడైనా దేవాలయ నిర్మాణానికి ఏ గ్రామస్థులైనా పూనుకున్నప్పుడే – అతనికి పిలుపువస్తుంది. అంతవరకూ విశ్రాంతే!

ఇన్నాళ్లూ కూడబెట్టిన డబ్బులతో జాగ్రత్తగా గంజో అంబలో తాగుతూ పెళ్లాం పిల్లలతో కాలం వెళ్లబుచ్చవలసిందే! పోనీ స్వయం ఉపాధి పథకం కింద ఏ బ్యాంకుల్లోనో ఋణం తీసుకుందామా అంటే, తనకి బంగారం పని కానీ కట్టు పని కానీ రాదు. శాశ్వత జీవనోపాధికి ఏదైనా మార్గం అన్వేషించాలి.


ఇందుమౌళి దిగులుగా, విషాద వదనంతో స్వగ్రామానికి బయలుదేరేడు నడకదారిని. అతని స్వగ్రామం ఆనందపురం జంక్షన్‌కి సుమారు పదిహేను కిలోమీటర్ల కంటే ఎక్కువ లేదు. అటువైపు నాటుబళ్లేకాని బస్సులు లేవు.

దారిలో ఒక పేవ్‌మెంట్ మీద ఒకడు చెయ్యి గుర్తు పెట్టుకుని 'హస్త సాముద్రికం' చెబుతున్నాడు.

పూర్వం వర్తకులు తమ సరుకుల్ని నౌకల మీద వేసుకుని సముద్రయానం చేస్తూ విదేశాలకు వెళ్లి వర్తకం చేసుకునేవారు. సత్యనారాయణ వ్రతం కథలో ఈ ప్రస్తావన వున్నట్టు మనకు తెలుసు. ఒక వర్తకుడు తన సరుకులతో సముద్రయానం చేస్తూ పడవ మునిగిపోగా, అతడు సత్యనారాయణవ్రతం చేయడం వల్ల తాను కోల్పోయిన సరుకులను తిరిగి పొందినట్లు మనం విన్నాము. చదివేము. సముద్రయానం చేస్తూ వెళ్లిన తన భర్త క్షేమంగా తిరిగి వస్తారా? అని తెలుసుకోగోరి వర్తకుని భార్య తన ఇంటికి వచ్చిన జ్యోతిషం తెలిసిన అతిథిని ప్రశ్నిస్తుంది. ఆ అతిథి, వర్తకుని భార్య చేతిలో వున్న రేఖల్ని చూసి, ఆమె భర్త క్షేమంగా తిరిగివచ్చేదీ లేనిదీ చెబుతాడు. ఈ విధంగా హస్తం చూసి, 'సముద్రయానా'నికి సంబంధించిన విషయం చెప్పడం వల్ల 'హస్తసాముద్రికం' అన్న మాట వాడుకలోకి వచ్చింది.

ఇందుమౌళి తన అదృష్టం ఎలా వుందో అని ఓ రూపాయిబిళ్ల సమర్పించుకున్నాడు. సాముద్రికుడు భూతదర్శనంతో ఇందుమౌళి కుడిచెయ్యిని జాగ్రత్తగా పరిశీలించి, కొన్ని లాభాలు, కొన్ని నష్టాలు చెప్పి, మొత్తం మీద లాభాలే ఎక్కువ చెప్పాడు. తనకే కాదు, తన కంటే ముందు చేతులు చూసినవాళ్లకి కూడా అలాగే చెప్పాడు. లేకపోతే మనిషి నిరాశవల్ల నిస్పృహ కలిగి, ఢీలాపడిపోయి, మళ్లీ చెయ్యి చూపించుకుందికి రాడు.

మరికొంత దూరం నడక సాగించేక, వాళ్ల గ్రామానికి తోవచూపే చిన్న జంక్షన్ – అదే ఆనందపురం జంక్షన్ వచ్చింది. అక్కడో శివాలయం వుంది. శివాలయ శిఖరం మీద త్రిశూలం – దాన్ని ఆనుకుని రెండు లౌడ్‌స్పీకర్లు, అందులోంచి ఓ పౌరాణికుని ఉపన్యాసం వినిపిస్తోంది. ఇందుమౌళి, పరమశివుని దర్శించి, ఓ స్తంభాన్ని ఆనుకుని కూర్చుని, ఆ ధార్మికోపన్యాసాన్ని శ్రద్ధగా విన్నాడు.




"జనులు సామూహిక ప్రార్థనలు చేసే చోటుని ఆలయమని అంటాము. సిద్ధాంత రీత్యా చూస్తే ఈ ప్రార్థనలు మనం ఏ స్థలంలోనైనా, ఏ సమయంలోనైనా చేయగలము. కాని, ఆలయాలలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు కల్పించబడతాయి. సాధారణంగా మన ఇళ్ళలో ప్రశాంతంగా పరతత్త్వ చింతన చేసే పరిస్థితి నెలకొని వుండదు. సామూహిక ప్రార్థనలు జరపడం వల్ల మనస్సుకి శాంతి చేకూరుతుంది. ప్రార్థనలలో సమావేశమయ్యే వ్యక్తుల హృదయాలలో మంచి పరతత్త్వాన్ని తెలుసుకుందామనే జిజ్ఞాస, ఆవేదన, అధికమయ్యే అవకాశం ఆలయాలలోనే వుంటుంది. సమావేశమయ్యే వ్యక్తుల మనసులు ఏకమై దేవదేవునిపై కేంద్రీకరించడం వలన మంచి ఫలితాలు గోచరిస్తాయి.

దేవాలయాలు అందరు మతస్థులకూ అవసరం. చర్చి, మసీదు, మందిరము, మఠము అని ఇతర మతస్థులు వారి వారి మతాచారాల రీత్యా పిలుచుకుంటున్నా – అది దేవదేవుని ఆలయమే!

కొన్ని . యుగాల క్రిందటనే మానవుడు ఈ బాహ్యప్రపంచాన్ని చూసి ముగ్ధుడయ్యాడు. 'గర్జిత మేఘాలను, పిడుగుపాటులను చూశాడు. సృష్టి వైచిత్రికి మూగపోయి, తలవని •తలంపుగానే ఆకసం వైపు చూసి చేతులు జోడించాడు. గంభీరమైన ఉన్నత పర్వతశ్రేణిని, ఎత్తయిన వృక్ష సముదాయాన్నీ గమనించాడు. ఈ సృష్టికి మూలమైన ఏదో మహత్తర శక్తి వుందని భావించాడు. ఆ మహత్తర శక్తిని ప్రార్థించడానికి కొన్ని ముఖ్యమైన నిర్ణీత స్థలాలే కావలసి వచ్చాయి. అంచేత ప్రత్యేకంగా దేవాలయాల నిర్మాణం అవసరమైంది" ఉపన్యాసం ముగించారు.

ఇందుమౌళి మనస్సు ఎంతో తేలికపడింది. పౌరాణికుని మాటలు హృత్తుకి హత్తుకున్నాయి. అవి మననం చేసుకుంటూ ఇల్లు చేరుకున్నాడు.

నాలుగు రోజులు పోయేక, నేషనల్ హైవేలో ఓ ఘోర దుర్ఘటన జరిగింది. రెండు బస్సులు గుద్దుకుని అనేకులు మరణించారు! మరికొందరు క్షతగాత్రులయారు. బస్సులు పిప్పి అయిపోయాయి!

ఈ వార్త వినగానే చుట్టుపక్కల గ్రామాల వాళ్లు ప్రమాదం జరిగిన స్థలానికి చూడ్డానికి వెళ్లేరు. అందులో ఇందుమౌళి ఒకడు. ఇందుమౌళి ప్రమాదం జరిగిన స్థలాన్ని నిశితంగా పరిశీలించాడు. అతనికి ఓ బ్రహ్మాండమైన ఐడియా తట్టింది!

శవాల పంచనామాలు అన్నీ అయిపోయిన ఐదారు రోజులకి ఆ గ్రామ పంచాయతీ ప్రెసిడెంటుని కలిశాడు ఇందుమౌళి. ఫలానా దేవతకి గుడికట్టి నిరంతరం పూజాపునస్కారాలు కొనసాగిస్తే ఇటుపైని ప్రమాదాలు జరగవని సూచించాడు. పంచాయతీ పెద్దలందరూ ఇందుమౌళి సూచనని ఆమోదించారు. హర్షించారు.

ఆ దేవతామూర్తి శిల్పాన్ని చెక్కవలసిన పని కూడా ఇందుమౌళికే అప్పజెప్పారు. ఇందుమౌళి స్వగ్రామానికి వెళ్ళి ఇల్లాలు పిల్లలతో, పరికరాలతో, రెండెడ్ల బండిమీద ప్రమాదం జరిగిన స్థలానికి పయనమయాడు. రోడ్డుప్రక్కగా తాటాకులతో పాక నిర్మించి ఇందుమౌళికి వసతి ఏర్పాటుచేశారు గ్రామస్థులు. సకుటుంబంగా అందులో బస చేశాడు ఇందుమౌళి.

తన నివాసానికి ఎదురుగా ఒక మర్రిచెట్టు

కింద దుమ్ము ధూళి పట్టేసిన ఓ బండరాయిని శుభ్రంగా తుడిచి, గ్రామ పంచాయతీ ప్రెసిడెంటుచేత ప్రజల సమక్షంలో కొబ్బరికాయ కొట్టించాడు. తన వద్దనున్న ఉలీ, సుత్తీ, శాణమూ మొదలైన పరికరాలతో శిల్పం చెక్కడం ప్రారంభించాడు.

ఓ నెల్లాళ్ళలో జీవకళలు ఉట్టిపడే అమ్మవారి విగ్రహం పూర్తయింది. ప్రతిష్ఠాపన ముహూర్తంనాడు ఆ చుట్టుపక్కల గ్రామ ప్రజలంతా తండోపతండాలుగా 'అమ్మ' వారిని దర్శించడానికి తరలివచ్చారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజ చేశారు. కొబ్బరికాయలు కొట్టారు. అరటిపళ్లు ఒలిచి, అగరువత్తులు వెలిగించారు.

కవి కోకిల జాషువగారన్నారు:

"జీవకళలు చెక్కు శిల్పిని విరసించి
శిల్పమునకు పూజసేయునట్టి
వక్ర చరితులున్న చోట
కళల కక్కుట! ప్రేత కళల గతులు"

సాధారణంగా శిల్పిని విస్మరించి, శిల్పాన్ని వేద మంత్రాల మధ్య ప్రతిష్ఠించి పూజలు సల్పుతారు. కాని, ఆ పంచాయతీ ప్రెసిడెంటు మాత్రం తద్భిన్నంగా అందరి అనుమతితోనూ ఇందుమౌళినే 'అమ్మ'వారి పూజారిగా నియమించాడు. ప్రజల, లారీల, బస్సులవాళ్ళ విరాళాలతో గుడి నిర్మాణం జరిగింది. ఓ భక్తుడు నుయ్యి తవ్వించాడు. మరో భక్తుడు కరెంటు వేయించాడు. వచ్చేపోయే లారీలవాళ్ళూ, బస్సు ప్రయాణికులు అక్కడ ఆగి, అమ్మవారికి కానుకలు సమర్పించుకుని, మొహాన బొట్టు పెట్టుకుని మరీ వెళుతున్నారు.


ఇందుమౌళి రాత్రి పదింటికి గజాల గుడ తలుపులు మూసేసినా, గజాల మధ్య నుంచి భక్తులు డబ్బులు పడేస్తున్నారు. ఆ కానుకలు ఇందుమౌళికే చెందుతాయి. ఆ విధంగా ఇందుమౌళికి శాశ్వత ఉపాధి లభ్యమైంది.

బస్సులు, లారీలు స్పీడుగా వచ్చి, అమ్మవారి గుడి దగ్గర ఆగి, మళ్లా నెమ్మదిగా స్పీడు అందుకోవడం వల్ల – ఆ గుడి దగ్గర మరి ప్రమాదాలు సంభవించలేదు. ఆ అమ్మవారే స్పీడ్ బ్రేకరు అయింది! అందుకే ఆర్ అండ్ బి వారు స్పీడ్ బ్రేకరు నిర్మించడం మానేశారు.

ఏ దేవతామూర్తిని ఇందుమౌళి తన శిల్ప కళా నైపుణ్యంతో రాతి మీద మలిచాడో, ఆ దేవతామూర్తే – ఇందుమౌళికీ కుటుంబానికీ కడుపునిండా అన్నం పెట్టే 'అన్నపూర్ణ' అవిపించుకుంది.

మనిషి చేసిన దేవుడే – ఆ మనిషిని కాపాడుతున్నాడు!

# సాహితీ 'గడి' బిడ-3



పేరు ..........................................
చిరునామా ..........................................

..........................................

– కత్తిరించుము –

**సాహితీప్రియుల**
**కొరకు, సాహితీ గళ్ళ నుడికట్టు**
**'సాహితీ 'గడి' బిడ'**

**గళ్ళ నుడికట్టు సమాధానాలు ఈ సంచిక విడుదలైన వారం రోజుల్లోగా మాకు పంపాలి ఆల్‌కరెక్టుగా వ్రాసిన విజేతలలో లక్కీ డ్రా ద్వారా ముగ్గురు విజేతలను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ. 100/- చొ..న అందజేస్తాము.**

**– ఎడిటర్.**

ఆధారాలు:

అడ్డం :

1. వేదము చదివినవాడు, లౌకికము తెలియనివాడు
3. నారికేళం
8. రావణుడికి ఇన్ని తలలున్నాయి.
9. ఇది పురుష లక్షణం. మధ్య అక్షరం వత్తు మాయమైంది.
11. పూర్వకాలంలో డబ్బుల్ని ఇలా అనేవారు. సందేహం కూడా వ్యక్తమౌతుంది.
12. దరిద్రాన్ని సూచిస్తూ ఇది పొయ్యిలో పడుకుంటుంది.
13. ఈ పజిల్ తిరగబడింది.
14. చాలాకాలం పాటు నీళ్ళు మార్చకపోతే ఇది పడుతుంది.
15. హిందీలో మాతృమూర్తిని పిలవండి.
16. పెంకుటిల్లు కాదది. అటుదిటూ, ఇటుదటూ.
18. పేదరాశి పెద్దమ్మ ఇది చెబుతుంది.
19. మూతి మీద ఇది వుంటే రోషం వున్నట్టే.
21. నవమాసాలూ మోసి జన్మనిచ్చిందామె.
22. బాకీ తీర్చడానికి కొద్దిగా 'గడువు' ఇవ్వండి.
24. కోటలో ఇది వెయ్యడమంటే మాటలు కాదు.
27. మీరు మరీ ఇది తీసిన బంటయితే ఎలా?
28. తరుగుతున్న వనరాజు.

నిలువు :

2. జ్యోతి వెలిగించండి
4. ఇది ఎన్నటికీ కోకిల కాలేదు. రంగు ఒక్కటే
5. చిన్నగా వానజల్లుపడుతోంది.
6. అబ్బ! తెగ కుట్టేస్తున్నాయి. చీమలు కావు. (తలక్రిందుగా)
7. నీడే! వెలుతురికి అడ్డం రావడం.
9. ఎంత ఉడికినా దీని కంపు పోదు.
10. చెరువుకి ఇది పడితే ఊరు మునిగిపోతుంది.
12. పక్షిజాతికి చెందినదే.
13. పాల మీద ఇది వుంటుంది. (చెదిరింది)
17. గ్రామదేవతకిది చేస్తారు.
19. ఇద్దరు రాజులు 'రాజీ' కుదుర్చుకున్నారు.
20. ఆస్ట్రేలియాకు చెందినవారిని వీటితో పోలుస్తారు.
22. బాధే (పైకి)
23. అతివాగుడుకాయ. ఇదెక్కువ పోసుంటారు.
25. అప్పుడే పరువంలోకొచ్చిన ఆవుదూడ
26. ఇది కూడా ఓ రాజకీయ పార్టీ గుర్తే.

– నిర్వహణ : దివ్య

**మనిషి ఔన్నత్యానికి మూడు కారణాలున్నాయి**
**అతని సత్ప్రవర్తన కోరికలు లేవని చెబుతుంది**
**కలతలు లేకపోవడం అతని విజ్ఞానానికి నిదర్శనం**
**దేవికీ భయపడకపోవడం అతని ధైర్యాన్ని తెలుపుతుంది**
**– కన్‌ఫ్యూషియస్**